ఆధార్ దందా!

- ఇక్కడ ఏదీ ఉచితం కాదు...
- మొదట ఫ్రీ... ఆ తర్వాత ఛార్జీల బాదుడు
- ఆన్‌లైన్‌లో ఫ్రీ అంటూ... సర్వీస్ చార్జ్ పేరుతో మళ్లీ వసూళ్లు
- కోట్లాదిమంది ప్రజలను దోచేస్తున్న మోడీ సర్కార్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రిలయన్స్ ఫోన్ల దందా గుర్తుందా? నూనె ప్యాకెట్ కొంటే మొబైల్ ఫోన్ ఫ్రీ... సూపర్ మార్కెట్లో బిల్లు చేస్తే మొబైల్ ఫ్రీ...పెట్రోల్ పోయించుకుంటే మొబైల్ ఫ్రీ.... రిలయన్స్ సంస్థ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకొనేందుకు ప్రజలకు ముందు 'ఉచితం' అంటూ ఎరవేసి, వారికి ఆ ఫోన్లు అలవాటయ్యాక, ఇప్పుడు టారిఫ్ రేట్లను ఇష్టం వచ్చినట్టు పెంచేసి, జనం జేబులను లూటీ చేస్తున్న విషయం స్ఫురణకు వస్తున్నదా? గతంలో ఔట్ గోయింగే కాదు...ఇన్ కమింగ్‌కూ చార్జీ పడేది. ఇప్పుడు అసలు ఫోన్ ఆన్ అవ్వాలన్నా రీచార్జ్ చేసుకోవాల్సిందే. కేంద్ర ప్రభుత్వం రియలన్స్ ఫోన్ల తరహాలోనే ఇప్పుడు ఆధార్ దందా చేస్తోంది. అప్పట్లో ఆధార్ కార్డు ఉచితం అనీ, అది ఉంటే జనం ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు వేస్తుందనే రకరకాల పుకార్లతో ప్రజలను ఆధార్ కార్డు తీసుకొనేలా ప్రోత్సహించింది. ఇప్పుడు అదే ఆధార్ కార్డులో ఏ చిన్న కరెక్షన్ చేసుకోవాలన్నా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని యునిక్ ఐడెంటిఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (యూఐఎఐ) ప్రజల ముక్కు పిండి పైసలు వసూలు చేస్తోంది. చార్జీలనూ తన ఇష్టం వచ్చినట్టు పెంచేసి, జనం జేబులకు చిల్లు పెడుతోంది. దేశంలోని 143.71 కోట్ల మంది ప్రజలకు ఈ కార్డును నిత్యవసరంగా మార్చేసింది. ఇప్పుడు ఈ కార్డు ద్వారా ప్రజలతో వ్యాపారం చేస్తున్నది. అన్ని ప్రభుత్వ పథకాలు, ఆర్థిక లావాదేవీల్లో ఆధార్ తప్పనిసరి. చివరకు ఆహార భద్రతా కార్డులు మొదలు ఆస్తుల అమ్మకం, కొనుగోళ్ళు కూడా ఆధార్ లేకుండా జరిగే పరిస్థితి లేదు. తెలంగాణలో ఇటీవల 'మహాలక్ష్మి' పేరుతో మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. దీనికి ఆధార్ కార్డును ప్రామాణికంగా నిర్ణయించారు. పదేండ్ల క్రితం దిగిన ఆధార్ కార్డులు చెల్లవనీ, కొత్తగా కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. దీంతో ఆర్‌టిసి బస్సుల్లో డ్రైవర్లు, కండక్టర్లతో మహిళా ప్రయాణీకుల గొడవలు అన్నీ ఇన్నీ కావు. దీనిపై మహిళలు ఆధార్ అప్‌డేట్ కోసం మీ సేవా కేంద్రాలు, పోస్టాఫీసుల్లో బారులు తీరారు. ఆధార్‌ను సులభతరం చేయడం మానేసి, ఒక దానికి మరో ధృవీకరణ పత్రాన్ని ప్రామాణికంగా చేర్చడంతో ప్రజలు వాటికోసం ఎమ్మార్వో ఆఫీసులు, మున్సిపల్ వార్డు కార్యాలయాలు, గ్రామ పంచాయతీ ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఆధార్‌లో చిరునామా మార్పు చేసుకోవాలంటే ఎమ్మార్వో ఆఫీసు నుంచి నివాస ధృవీకరణ పత్రం తేవాలని షరతు విధించారు. పేరు మార్పు కోసం నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. చనిపోయిన వ్యక్తుల పేర్ల ఆస్తులు ఉంటే, దస్తావేజుల్లో ఉన్న పేరే ఆధార్‌లోనూ ఉండాలనే నిబంధనతో వారసులకు చుక్కలు కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ పెన్షనర్లూ కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆధార్ కార్డులో ఏ చిన్న అక్షరం తేడా వచ్చినా పెన్షన్‌ను నిలిపివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "నాపేరు మాధవీ లత. భర్త బీఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తూ మరణించారు. ఆయన తన ఆఫీసు పత్రాల్లో నామినీ పేరు 'మాధవి' అని రాసారట... నా ఆధార్‌కార్డులో మాధవీలత అని ఉంది. దీనితో ఆ కార్డును సరిచేసుకొస్తేనే పెన్షన్ మంజూరు చేస్తామని అధికారులు కొర్రీ పెట్టారు. చాలా సార్లు మీ సేవా కేంద్రానికి వెళ్లాను. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా, రిజెక్ట్ చేస్తున్నట్టే వస్తుంది. దీనితో మీసేవా కేంద్రం వాళ్లుఅమీర్‌పేటలోనియుఐఎఐప్రాంతీయ కార్యాలయానికి వెళ్లమన్నారు. అక్కడికి వెళ్తే ఇవాళ రేపు అని మూడు నెలలుగా తిప్పుతున్నారు" అని ఓ బాధితురాలు 'నవతెలంగాణ'తో వాపోయింది.

ఉచితం లేదు...

ఆధార్ కార్డులో సవరణలు ఏవీ ఉచితం కాదు. అడ్రస్ మార్పు మొదలు, మొబైల్ నెంబర్ యాడ్ చేయించుకున్నా డబ్బులు చెల్లించాల్సిందే. కానీ ఆధార్ వెబ్‌సైట్‌లో మాత్రం కొన్ని రకాల సేవలు ఉచితం అని దర్శనమిస్తున్నాయి. ఆధార్ కేంద్రాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే సేవలు పొందవచ్చని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తుల్లో 60 శాతానికి పైగా రిజెక్ట్ అవుతున్నాయని బాధితులు చెప్తున్నారు. మీ సేవా కేంద్రమైనా, ఆన్‌లైన్ అయినా ఒకసారి దరఖాస్తు చేసినప్పుడు అది రిజెక్ట్ అయితే, మరోసారి దరఖాస్తు చేసుకుంటే మళ్లీ డబ్బు చెల్లించాల్సిందే. ఈ విధంగా కుటుంబ సభ్యుల ఆధార్ కరెక్షన్స్ కోసం వందల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చిందని రుత్విక్ అనే యువకుడు వాపోయాడు.

చార్జీల పెంపు

గతంలో ఆధార్ కార్డు నమోదు సమయంలో కెవైసి చేసుకోవాల్సి వస్తే రూ.30 చార్జ్ చేసేవారు. ఆ మధ్య దాన్ని రూ.50కి పెంచారు. తాజాగా ఈ చార్జీని రూ.100కి పెంచారు. చిరునామా మార్పు, పుట్టిన తేదీ, పేరు మార్పు, ఫోన్ నెంబర్ మార్పులు వంటి సేవలకు ఆధార్ వెబ్‌సైట్ ద్వారా స్వయంగా చేసుకుంటే రూ.50 చెల్లించాలి. మీసేవా ప్రయివేటు ఫ్రాంఛైజ్ కేంద్రాల్లో ఈ చార్జీలను ఇష్టం వచ్చినట్టు వసూలు చేస్తున్నారు. జనాభా నవీకరణ (డెమోగ్రఫిక్ అప్‌డేట్) పేరుతో ఫోటో గుర్తింపు, బయోమెట్రిక్, ఐరిస్ వంటి సేవల చార్జీని రూ.100కి పెంచారు. ఈ సేవలను ఒకేసారి అప్‌డేట్ కావు. డెమోగ్రఫిక్ అప్‌డేట్ అయ్యేందుకు కనీసం 15 రోజులు సమయం పడుతుంది. ఆ తర్వాత మళ్లీ డబ్బు చెల్లించి, అడ్రస్ మార్పు, మొబైల్ నెంబర్ కూర్పు వంటి సేవల్ని పొందాల్సి ఉంటుంది. దీనితో ప్రజలు పలుమార్లు యుఐఎఐకి డబ్బు చెల్లించి, సేవలను పొందాల్సి వస్తున్నది. ఏ కారణంగా ఆధార్ అప్‌డేట్ దరఖాస్తు రిజెక్ట్ అయ్యిందో యుఐఎఐ ఎలాంటి వివరణ ఇవ్వట్లేదు. దేశంలోని ప్రజలందరిదీ ఇదే పరిస్థితి. తెలంగాణ రాష్ట్రంలో మహాలక్ష్మితోపాటు గృహలక్ష్మి పేరుతో రెండొందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ వంటి అన్ని సేవలకూ ఆధార్‌ను తప్పనిసరి చేయడంతో ప్రజలకు తిప్పలు తప్పట్లేదు.

కేంద్రాల కుదింపు

కేంద్ర ప్రభుత్వం ఆధార్ కేంద్రాల సంఖ్యను గణనీయంగా తగ్గించేసింది. గతంలో జాతీయ బ్యాంకులు సహా పలు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఉండేవి. తాజాగా వీటన్నింటినీ తీసేసింది. రాష్ట్ర జనాభా 4 కోట్లకు పైగానే ఉంది. వారందరికీ ఆధార్ తప్పనిసరి. కానీ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడున్న ఆధార్ నమోదు కేంద్రాలు కేవలం 2,376 మాత్రమే ఉన్నాయి. వీటిలోనూ అన్ని సేవలు ఒకేచోట లభించవు. డెమోగ్రఫిక్ అప్‌డేట్స్ ఒక చోట ఉంటే, ఎన్‌రోల్‌మెంట్, కరెక్షన్స్ వంటి సేవలు మరోచోట ఉన్నాయి. ఏ ఆధార్ కేంద్రానికి వెళ్లినా వందల్లో ప్రజలు క్యూలైన్లలో కనిపిస్తున్నారు.

ఇష్టారాజ్యం

ఆధార్ విధివిధానాల్లో ఇష్టారాజ్యంగా మార్పులు చేర్పులు చేస్తున్నారు. 0-5 సంవత్సరాల్లోపు చిన్న పిల్లలకు ఆధార్‌ఉచితంగాఇచ్చేవారు. అలాగే 15 సంవత్సరాలలోపు యువతీయువకులు తమ ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసుకొనేందుకు కూడా సేవల్ని ఉచితంగా అందించేవారు. ఇప్పుడు ఏవీ ఉచితం కాదు. సర్వీస్ చార్జీల పేరుతో అన్ని సేవల్ని డబ్బులు చెల్లించి కొనుక్కోవల్సిందే!

కోట్ల రూపాయలు వసూలు

ఆధార్ కరెక్షన్స్ పేరుతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజల నుంచి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నది. ప్రతి ఏడాదీ ఈ దోపిడీ రెట్టింపే అవుతున్నది. 2009-10 నుంచి 2021-22 వరకు యూఐఏఐ (ఆధార్) వార్షిక లెక్కల్లో ఆదాయం గణనీయంగా పెరుగుతున్నట్టు గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో కేవలం ఆధార్ సేవల ద్వారా యూఐఏఐకి వచ్చిన ఆదాయం అక్షరాలా రూ.387.41 కోట్లు. 2009-10లో ఈ సంస్థ చేసిన ఖర్చు కేవలం రూ.26.21 కోట్లు కావడం గమనార్హం. దీన్నిబట్టి ఆధార్ దోపిడీ ఏ విధంగా జరుగుతున్నదో ప్రజలు అర్థం చేసుకోవచ్చు.

కాంగ్రెస్‌లో చేరిన జిహెచ్‌ఎంసి డిప్యూటీ మేయర్

- మోతే శ్రీలత శోభన్ రెడ్డి కూడా....

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, బిఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్ తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా వారు బయలుదేరి ముందుగా గన్ ఫౌండ్రీలో ఉన్న అమరవీరుల స్థూపం దగ్గర నివాళ్లర్పించారు. అనంతరం గాంధీ భవన్‌లో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, కాంగ్రెస్ అంబర్‌పేట్ అభ్యర్థి రోహిన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్‌మోహన్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫాసియుద్దీన్, శివకుమార్, పవన్ కళ్యాణ్, కాంగ్రెస్ కార్పొరేటర్లు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లాస్య కుటుంబానికి కెటిఆర్ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పరామర్శించారు. సికింద్రాబాద్ కార్ఖానాలోని లాస్య నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. బిఆర్ఎస్ ఎల్లవేళలా వారి కుటుంబానికి అండగా ఉంటుందని, లాస్య తల్లి గీత, సోదరీలు నమ్రత, నివేదితకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే లాస్య రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరంగా ఉందన్నారు. తాను విదేశాల్లో ఉన్న కారణంగా లాస్య అంత్యక్రియలకు హాజరుకాలేక పోయానని తెలిపారు. లాస్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఏడాది వ్యవధిలోనే సాయన్న, లాస్యలు మరణించడం కంటోన్మెంట్ ప్రజానీకానికి తీరని లోటని అన్నారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుతున్నట్టు చెప్పారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అలా వెంకటేశ్వర రెడ్డి పాల్గొని లాస్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిమ్స్‌లో 300 మంది నర్సుల నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల పోస్టులకు సంబంధించిన తుది జాబితాను నిమ్స్ ఆస్పత్రి విడుదల చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాంట్రాక్ట్ నర్సుల పోస్టుల కోసం 30,261 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 300 మందిని అధికారులు ఎంపిక చేశారు. ఎంపికైన వారు సోమవారం నుంచి మార్చి 4వ తేదీ వరకు విధుల్లో చేరాలని ఆదేశించారు. ఈ పోస్టులకు సంబంధించి గత నెల 4న నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

రామకృష్ణారెడ్డి మృతి బాధాకరం

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రగతి శీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జాతీయ కన్వీనర్ వి సంధ్య భర్త, కవి, నవ్య ప్రింటింగ్ ప్రెస్ యజమాని రామకృష్ణారెడ్డి మృతి బాధాకరమని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. రామకృష్ణారెడ్డి సంతాప సభలో పాల్గొని నివాళులర్పించారు.

బిఆర్‌ఎస్‌లో నాయకులకు ప్రాధాన్యత లేదు

- మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి
- ఆ పార్టీకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన
- 27న కాంగ్రెస్ పార్టీలో చేరిక

సమావేశంలో మాట్లాడుతున్న తీగల కృష్ణారెడ్డి

పజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీలో కేవలం కెసిఆర్ కుటుంబ సభ్యులకు తప్ప ఇతర నాయకులకు ప్రాధాన్యత లేదని, స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు ఇవ్వకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాలించిందని రంగారెడ్డి జిల్లా జడ్పి చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని టికెఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో జడ్‌పి చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పదేండ్ల క్రితం జిల్లా పరిషత్తు గ్రామపంచాయతీల్లో పుష్కలంగా నిధులు ఉండేవని, అభివృద్ధి పనులు జరిగేవని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ నిధులు కేటాయించకుండా అభివృద్ధి నిరోధకంగా పరిపాలన చేసిందని విమర్శించారు. అందుకే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైందని తెలిపారు. తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి అనేక పదవుల్లో ఎమ్మెల్యేగా, హైదరాబాద్ మేయర్‌గా, హుడా చైర్మన్‌గా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేశానని గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీలో చేరినప్పటి నుంచి తనకు ప్రాధాన్యత ఇవ్వకపోయినా పార్టీ కోసం పనిచేశానని చెప్పారు. ఇతర పార్టీల్లో గెలిచిన ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకొని మంత్రి పదవులు కట్టబెట్టి సొంత పార్టీ నాయకులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బిఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నెల 27న చేవెళ్లలో జరగబోయే బహిరంగ సభలో తెలంగాణ పిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు తెలిపారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు పల్లె పాండుగౌడ్, సిద్ధల బాలప్ప, బేర బాలకృష్ణ, ఆకుల అరవింద్ కుమార్, రాకేష్ రెడ్డి, చప్పిడి సంతోష్ రెడ్డి, నాగేందర్ గౌడ్, తదితర నాయకులు ఉన్నారు.

దాడులకు భయపడేది లేదు

- ఇటుకలతో దాడి చేస్తే.. రాళ్లతో ప్రతిఘటిస్తాం
- నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నిధులపై పార్లమెంటులో ప్రశ్నించాలంటే రాష్ట్రంలోని పార్లమెంటు నియోజకవర్గాలన్నింటిలో బిఆర్ఎస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నాగర్ కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాల విస్తృతస్థాయి సమావేశాలను ఆదివారం నిర్వహించారు. ఆయా సమావేశాల్లో కెటిఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో ఉంది కదాని విర్రవీగుతూ ఇటుకలతో దాడి చేస్తోందని, దానిని ప్రతిఘటిస్తామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యంకానీ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు ఆ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. కుటుంబంలో ప్రతి మహిళకు నెలకు రూ.2,500 చెల్లిస్తామని చెప్పారని, దీనికోసం రాష్ట్రంలో 1.65 కోట్ల మంది మహిళలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రూ.500కే సిలిండర్ కోసం 1.24 కోట్ల మంది, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 1.34 కోట్ల మంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ పథకాలు అమలు చేయడానికి అనేక కొర్రీలు పెడుతూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మిషన్ భగీరథ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బిజెపి జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. ఇలాంటి ఎన్నో సమస్యల పరిష్కారానికి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గులాబీ పార్టీకి పట్టంకట్టేలా ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. ఓడిపోయినా ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూనే ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మల్కాజిగిరి' బరిలో ఎవరు..?

- లోక్‌సభ అభ్యర్థుల ప్రకటనపై పార్టీల కసరత్తు
- బిఆర్ఎస్ నుంచి భద్రారెడ్డి.. బిజెపి నుంచి ఈటల పేర్లు దాదాపు ఖరారు
- కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ
- ఈ నెల 29న బిజెపి మొదటి జాబితా



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలషెడ్యూల్ మరో పది రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. మరోపక్క ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కోసం తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఈ నెల 29న బిజెపి మొదటి జాబితా విడుదల కానుంది. ఇందులో మల్కాజిగిరి అభ్యర్థి పేరు ఉంటుందా..? మరో విడతలో ఖరారు అవుతుందో తేలనుంది. ఇక కాంగ్రెస్‌లో దరఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత అభ్యర్థి ఎంపిక ప్రక్రియ తుది దశకు వచ్చింది. దరఖాస్తు చేసుకున్న వారి పేరును ప్రకటిస్తారా..? లేక కొత్త వారిని బరిలో దించుతారా..? అనేది చూడాల్సి ఉంది. బిఆర్ఎస్ నుంచి పెద్దగా పోటీ లేకపోవడంతో అభ్యర్థి ప్రకటన ఈజీ కానుంది. మార్చి మొదటి వారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించే ఛాన్స్ ఉంది.

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ 'మినీ ఇండియా'. ఇక్కడ దాదాపు 40 లక్షల జనాభా ఉంది. ఇందులో 7 లక్షల వరకు నార్త్ ఇండియన్స్ ఉండటంతో బిజెపి ఈ సెగ్మెంట్‌పై కన్నేసింది. దీనికితోడు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో బిజెపి రెండో స్థానంలో నిలవడంతో ఓటు బ్యాంక్‌లోనూ పెరిగింది. ఇక సిఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానం కావడంతో ఈసెగ్మెంట్ విషయంలో కాంగ్రెస్ ఆచి తూచి వ్యవహరిస్తోంది. బలమైన అభ్యర్థిని బరిలో దించేందుకు కసరత్తు చేస్తోంది. దరఖాస్తు చేసుకున్న వారితోపాటు కొత్తగా పార్టీలో చేరిన, చేరే నాయకుల్లో ఒకరిని పోటీ చేయించినా ఆశ్చర్య పోనక్కర్లేదు. బిఆర్ఎస్ నుంచి పెద్దగా పోటీ కనిపించడం లేదు. సెగ్మెంట్ పరిధిలోని అన్ని నియోజకర్గాల్లోనూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నా.. లోక్‌సభ నుంచి పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. టికెట్ ఆశించిన జిహెచ్ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కాంగ్రెస్‌లో చేరడంతో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబానికి లైన్ క్లియర్ అయ్యింది.

బిజెపి, బిఆర్ఎస్ ముందంజ..

ఇప్పటికే ఇంద్రవెల్లి నుంచి సిఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించగా.. విజయ సంకల్ప యాత్ర పేరుతో బిజెపి సైతం ఎన్నికల కదన రంగంలోకి దిగింది. ఇప్పటికే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ యాత్ర ముగిసింది. ఈ ఇరు పార్టీలూ శ్రేణులనుఎన్నికలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చాయి. ఇదిలా ఉంటే బిఆర్ఎస్, బిజెపి నుంచి టికెట్ ఆశిస్తున్న పలువురు అభ్యర్థులు ప్రస్తుతం పార్లమెంట్ పరిధిలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. బిఆర్ఎస్ తరుపున మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి ఉచిత మెడికల్‌క్యాంపులతో అన్ని నియోజకవ ర్గాలను చుట్టేస్తున్నారు.బిజెపి నుంచి దాదాపు ఏడు నుంచి పది మంది వరకు అభ్యర్థులు వాల్ పోస్టర్లు, భారీ కటౌట్లతో ప్రచారంలోకి దిగారు. కొందరు అభ్యర్థులు సెగ్మెంట్ పరిధిలోని ముఖ్య నాయకులతో సమావేశమవుతున్నారు. ఇక కాంగ్రెస్ ఆశావహులు మాత్రం ఇప్పటి వరకు జనాల్లోకి వెళ్లలేదు.

పోటాపోటీ..

బిజెపి నుంచి చాలా మంది ఆశావహుల పేర్లు వినిపిస్తున్నాయి. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత మల్క కొమురయ్య, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు,,బిజెపి రాష్ట్రనేతకూన శ్రీశైలంగౌడ్ తోలపాటు రూరల్ జిల్లా అధ్యక్షులు హరీశ్‌రెడ్డి, రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి పోటీ పడుతున్నారు. కానీ అధిష్టానానికి పంపిన షార్ట్ లిస్టులో మురళీధర్‌రావు, ఈటల రాజేందర్, మల్క కొమురయ్య పేర్లు ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. సినీనటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, సినీ నిర్మాత బండ్ల గణేష్‌తోపాటు నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తుంది. టికెట్ కేటాయిస్తే 'మర్రి' పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్టు జిల్లా కాంగ్రెస్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

దాదాపు వీరి పేర్లు ఖరారు..

ప్రధాన పార్టీలైన బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్.. గెలుపు గుర్రాల ఎంపికపై ఫోకస్ పెట్టాయి. ఇప్పటికే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో మాజీ మంత్రి మల్లారెడ్డి భేటీ అయ్యి మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిత్వంపై చర్చించారు. ఆ తర్వాత కొన్ని రోజులకు తన కుమారుడు బరిలో ఉంటాడని బహిరంగంగా చెప్పారు. తదనంతరం ఆ పార్టీ నుంచి భిన్న స్వరాలు వినిపించకపోవడంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా భద్రారెడ్డి పేరు దాదాపు ఖరారైనట్టు సమాచారం. ఇక బిజెపి నుంచి తాము బరిలో ఉంటామని ఇప్పటికే పలువురు నేతలు బహిరంగంగా ప్రకటించినా అధిష్టానం మాత్రం మాజీ మంత్రి ఈటల రాజేందర్ వైపే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. బీసీ సామాజిక తరగతిలో బలమైన నేత కావడం ఒక కారణం అయితే.. టికెట్ కేటాయించకపోతే పార్టీ మారి నష్టం జరిగే ప్రమాదం ఉందని భావించిన బిజెపి అధిష్టానం దాదాపు ఈటల పేరునే ఫైనల్ చేసినట్టు సమాచారం.

గురుకుల టిజిటి ఫలితాలు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణసంక్షేమ గురుకు లాల్లో టిజిటి ఉద్యోగ పరీక్షల ఫలితాలు వచ్చే శాయి. ఆదివారం సాయంత్రం ఈ ఫలితాలను గురుకుల విద్యా సంస్థల నియామక బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. గురుకులాల్లో 4,020 పోస్టులు ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టిజిటి) పోస్టులకు గతేడాది ఆగస్టులో రాత పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షల్లో మెరిట్ సాధించిన అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఎంపిక చేసింది. ఈ మేరకు ప్రొవిజినల్ సెలెక్షన్ జాబితాలను విడుదల చేసింది. ప్రొవిజినల్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు ఫిబ్రవరి 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించింది.

సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది: జీవన్ రెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఆరు గ్యారంటీల్లో రెండు అమలు అవుతున్నాయి మరో రెండు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఉచిత బస్ ప్రయాణం వల్లే మేడారం జాతరకు మహిళా భక్తులు పోటెత్తారని అన్నారు. ఈయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుంది. ఉద్యోగులు గత ప్రభుత్వం తెచ్చిన 317 జీవోతో స్థానికతకు దూరంగా వెళ్లారు. జీవో 46, జీవో 317లను సమీక్షించేందుకు సబ్ కమిటీ వేయడం హర్షణీయమని అన్నారు.

పోలీస్ అధికారులు.. మీ సేవలకు సలాం..

మృతదేహాన్ని మోసుకొస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధి నిర్వహణలో కఠినంగా ఉండే కాకీలు.. కష్టాల్లో ఉన్నవారికి సాయం అందించేందుకు ప్రాణాలు లెక్క చేయకుండా సహాయం చేస్తారని ఈ సంఘటన రుజువు చేస్తుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ పట్టణానికి చెందిన రోహిత్ లాల్ (21) ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతరకు వచ్చి చిలకలగుట్ట వెనుక భాగంలోని దయ్యాల మడుగు ప్రదేశంలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయారు. సమాచారం అందుకున్న సిసిఎస్ సిఐ అనుముల శ్రీనివాస్, ఎస్బీఐ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కానిస్టేబుల్ శంకర్ ప్రాణాలకు తెగించి రెండు గంటలపాటు మృతదేహం కోసం ముమ్మరంగా గాలించి ఎట్టకేలకు మృతదేహాన్ని గుర్తించారు. సంఘటనా స్థలానికి వాహనం వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రెండు కిలోమీటర్ల మేర స్వయంగా మోస్తూ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు చేసిన సాహసం, సహాయం ప్రతి ఒక్కరి అభినందనలు అందుకుంది. కాగా, మృతదేహాన్ని అందుకున్న బంధువులు.. పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పోలీస్ అధికారుల పనితీరు, కష్ట సమయంలో చూపిన మానవత్వం అందరి మన్ననలను అందుకుంది.

న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

- కర్ణాటక తరహాలో రాష్ట్రంలోనూ రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించాలి
- ఎస్ఎఫ్ఐ న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వెన్షన్‌లో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రత్యేకంగా న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి కర్ణాటక తరహాలో న్యాయ విద్యార్థులకు, న్యాయవాదులకు రూ. 15 వేల స్టైఫండ్ అందించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. హైదరాబాద్ గోల్కొండ క్రాస్ రోడ్స్‌లోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వెన్షన్ నిర్వహించారు. ముందుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మరణించిన న్యాయవాదులకు సంతాపాన్ని ప్రకటించారు. నాయకులు రమ్య, విగ్నేష్, స్టాలిన్ అధ్యక్షతన జరిగిన కన్వెన్షన్‌కు ఐలు రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో జిల్లాల విభజన తర్వాత కోర్టుల్లో కేసులనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించడానికి కిందిస్థాయి కోర్టులను ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలో అణగారిన వర్గాల విద్యార్థుల నుంచి న్యాయ విద్య వైపు వస్తున్న వారికి సరైన ప్రోత్సాహం లేక మధ్యలోనే ప్రాక్టీసు ఆపేస్తున్నారని, అలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించాలన్నారు. న్యాయ విద్యలో ప్రస్తుతం సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కరిక్యులమ్‌ను తయారు చేసి ప్రవేశ పెట్టాలని తెలిపారు. నేడు దేశంలో 50 మిలియన్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి సరిపడా న్యాయ వాదులు, న్యాయ స్థానాలు రాష్ట్రంలో, దేశంలో లేవని, కావున ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా న్యాయవాది శైలజ మాట్లాడుతూ.. మహిళా విద్యార్థులకు వారు పని చేస్తున్న దగ్గర, చదువుకుంటున్న దగ్గర వేధింపులకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే మహిళలకు సరైన ప్రోత్సాహం అందించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు మాట్లాడుతూ.. కేరళ, కర్ణాటక తరహాలో రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో న్యాయ విద్యను అందించడానికి ప్రత్యేక న్యాయ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో చదువుతున్న విద్యార్థులకు కేరళ, కర్ణాటక రాష్ట్రాల తరహాలో నెలకు రూ. 15 వేలు స్టై ఫండ్ రెండేండ్ల పాటు అందించాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా రానున్న కాలంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పలు తీర్మానాలు చేశారు. ఈ సభలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, కె అశోక్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు దమెర కిరణ్, దాసరి ప్రశాంత్, శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, రమేష్, అరవింద్, స్టాలిన్, హైదరాబాద్ జిల్లా నాయకులు సుష్మా, సహన, నందిని, భవన, శ్యామ్, అనిల్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నిక:

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ న్యాయ విద్యార్థుల కన్వీనింగ్ కమిటీని 25 మందితో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా విగ్నేష్ కో- కన్వీనర్‌గా డి.ప్రశాంత్, శ్రీకాంత్, ఎం. స్టాలిన్ రమ్య చౌహన్, స్టాలిన్‌లు ఎన్నికయ్యారు. 11 తీర్మానాలు ఆమోదించారు.

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వెన్షన్‌లో మాట్లాడుతున్న వక్తలు

ఎంపి అభ్యర్థులు ఖరారు కాలేదు

- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీచేసే అభ్యర్థుల ఎంపికపై ఇప్పటివరకూ పార్లమెంటరీ బోర్డుగానీ, ఎన్నికల కమిటీగానీ సమావేశాలు నిర్వహించలేదనీ, అభ్యర్థుల లిస్టు ఖరారు కాలేదని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపి అభ్యర్థుల ఎంపిక జరిగినట్టుగా మీడియాలో అసత్యప్రచారం చేస్తున్నారని తెలిపారు. తమ పార్టీలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై పార్లమెంటరీ బోర్డు, ఎన్నికల కమిటీలో చర్చించిన తర్వాతనే ప్రజాస్వామ్యయుత పద్ధతిలో జరుగుతుందని స్పష్టం చేశారు.

పోలేపల్లిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూమి విక్రయంలో మిగిలిన డబ్బులు చెల్లించాలని అడగడంతో కొనుగోలుదారుడు అమ్మకందారుడ్ని కులం పేరుతో దూషించిన ఘటన హన్మకొండ జిల్లాలో చోటుచేసుకుంది. దాంతో బాధితుని ఫిర్యాదు మేరకు కొనుగోలుదారుడు, కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాసరెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట గ్రామానికి చెందిన మారేపల్లి సుమన్‌కు హన్మకొండ పట్టణంలోని గోపాలపురంలో భూమి ఉండగా తన అవసరాల నిమిత్తం భూమి అమ్మకానికి పెట్టాడు. కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆ భూమిని రూ.17 లక్షలకు కొనుగోలు చేశాడు. భూమి అమ్మిన సమయంలో సుమన్‌కి రూ.11 లక్షలు చెల్లించిన పోలేపల్లి.. మిగతా రూ.6 లక్షలకు ఒక నెల గడువు పెట్టారు. గడువు ముగియడంతో సుమన్ తనకు రావాల్సిన డబ్బులు పోలేపల్లిని అడగగా, రేపు మాపు అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఈ నెల 7వ తేదీన డబ్బుల కోసం సుమన్ శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేయగా.. కులం పేరుతో దూషించి చంపుతా అని బెదిరించినట్టు బాధితుడు తెలిపారు. బాధితుడు సుమన్ ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

విశ్వనాథ్ సినిమాలు చరిత్రలో సుస్థిరం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

ప్రజాశక్తి కల్చరల్

దేశం లో వంద ఉత్తమ సినిమాలలో పది సినిమాలు విశ్వనాథ్‌వే ఉంటాయని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన శంకరాభరణం సాగర సంగమం స్వర్ణ కమలం స్వాతి కిరణం వంటి భిన్న కదా చిత్రాలు చరిత్రలో సుస్థిరంగా ఉంటాయని జస్టిస్ కొని యాడారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో కె విశ్వనాథ్ జయంతి సందర్భంగా స్వర్ణకమలంలో నటించిన షరాన్ లోవెన్‌ను జస్టిస్ రాధారాణి సత్కరించి మాట్లాడారు. అమెరికా దేశీయులైన షరాన్ లోవెన్ భారతీయ నాట్య ప్రక్రియలపై అధ్యయనం కోసం వచ్చి ఒడిస్సీ కథక్ వంటి నాట్యాలలో పరిణత సాధించి స్వర్ణకమలంలో నటించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు అని ప్రశంసించారు. షరాన్ లోవేన్ మాట్లాడుతూ ప్రతి దేశానికి కళలు సంస్కృతి సంప్రదాయాలు ప్రాథమిక లక్షణాలు అన్నారు. తనకు తన అమెరికా సంస్కృతి పట్ల గౌరవం వుందని అలాగే భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తి వుందని చెప్పారు. విశ్వనాథ్ చిత్రాలలో వున్న సంస్కారం అందరికీ ఆదర్శమన్నారు. విశ్వనాథ్ కుమార్తు నాగేందర్ మాట్లాడుతూ తమ తండ్రి చివరి రోజుల్లో ఎక్కువ సార్లు స్వర్ణ కమలం సిడి చూసేవారు అని ప్రముఖ నాట్య గురువు డాక్టర్ ఎస్‌పి భారతి అధ్యక్షత వహించిన వేదికపై వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, సినీ నిర్మాతలు బద్రి నాథ్, మురళి దర్, దయాకర్ స్వామి పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు పుష్ప కార్యదర్శి సురేందర్ సారథ్యంలో నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి

అన్నదాతలపై కాల్పులు అమానుషం

- కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి
- స్వామినాథన్ సిఫారసుల అమలుతోనే భారతరత్నకు సార్థకత
- ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతు
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని

సదస్సులో మాట్లాడుతున్న పోతినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న అన్నదాతలపై మోడీ ప్రభుత్వం కాల్పులు జరపడం అమానుషమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఎంఎస్‌పిపై ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన నాడు గుజరాత్ సిఎం నరేంద్ర మోడీ నేడు ప్రధానమంత్రిగా ఆ కమిటీ సూచనలను ఆచరణలో పెట్టడంలేదని విమర్శించారు. స్వామినాథన్ సిఫారసుల అమలుతోనే ఆయనకిచ్చిన భారతరత్నకు సార్థకత చేకూరుతుందని.. స్వయంగా ఆయన కుమార్తె మధుర వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన స్థానిక మంచికంటి మీటింగ్ హాలులో ఆదివారం నిర్వహించిన సదస్సులో పోతినేని మాట్లాడారు.

ధాన్యాలు, పప్పులు, నూనె గింజలు, వాణిజ్య తదితర 23 రకాల పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా మోడీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నీతి ఆయోగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్న స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకుండా.. ఆయన మరణానంతరం భారతరత్న ఇవ్వడం అవార్డుకు సార్థకత చేకూరినట్టు కాదని తెలిపారు. వాస్తవ ధరకు కౌలు, పెట్టుబడి, శ్రమ, ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు.. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని మొత్తం ఖర్చుపై 50 శాతం అదనంగా ఎంఎస్‌పి నిర్ధారించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలనే ఆరు డిమాండ్ల సాధన కోసం రైతులు ఢిల్లీలో ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. భూసేకరణ చట్టం-2013ను సైతం మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ విలువైన పంట భూములను కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆరోపించారు. పెసా, 1/70 చట్టాలను కూడా తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. ఢిల్లీలో రైతుల ఆందోళనలకు మద్దతుగా నిర్వహించే ఉద్యమాలకు సంఘీభావం తెలపాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, వై విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్
- నేటి ఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎం శోభన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతాంగ ఉద్యమంపై నిర్బంధాన్ని ఆపాలని, కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎస్‌కెఎం రాష్ట్ర నాయకులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం శోభన్ డిమాండ్ చేశారు. కేంద్ర హోం మంత్రి, హర్యానా ముఖ్యమంత్రిపై హత్యానేరం మోపాలన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో మృతిచెందిన యువ రైతు శుభకరన్ సింగ్ స్ఫూర్తితో రైతు పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల నిరసన స్థలంలో రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేశారన్నారు. టియర్‌గ్యాస్ ప్రయోగించడం, రైతులపై దాడి చేయడం లాంటి చర్యలకు పాల్పడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, హర్యానా ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంమంత్రి, మనోహర్ లాల్ ఖట్టర్, అనిల్ విజ్ రాజీనామా చేయాలని, వారిపై సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. కాల్పులు, ట్రాక్టర్లకు జరిగిన నష్టంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుల కుటుంబానికి రూ కోటి నష్టపరిహారం ఇవ్వాలని, పాడైన వంద ట్రాక్టర్ల మరమ్మతు ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే ఫిబ్రవరి 26న జాతీయ రహదారులపై ట్రాక్టర్లు, వాహనాల ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో జరిగే ఆందోళనలో పార్టీలకతీతంగా రైతులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. నిజామాబాద్ పట్టణంలో గాంధీ చౌక్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గంగాధరప్ప, పల్లపు వెంకటేశ్, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమన్న, నాయకులు డి కృష్ణ గౌడ్, శ్రీనివాసరెడ్డి, బన్సీ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్, బిజెపి ఒప్పందంలో భాగమే

- కవితకు సిబిఐ నోటీసులపై జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్, బిజెపి లోపాయికారి ఒప్పందంలో భాగంగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సిబిఐ నోటీసులు ఇచ్చిందని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి చెప్పారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు మరో కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. ఆమెను అరెస్టు చేస్తే సానుభూతి వస్తుందని భావిస్తున్నారని తెలిపారు. తర్వాత కాంగ్రెస్ ఓట్లు చీల్చాలనేది ఆ పార్టీ నేతల ఆలోచన అని అన్నారు. ఆదివారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబం అని చెప్పారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావడం కోసం నిర్విరామంగా పనిచేస్తానన్నారు. ఎఐసిసి అగ్రనేత రాహుల్ ప్రధానిగా కాకుండా బిఆర్ఎస్, బిజెపి కుట్ర పన్నుతోందన్నారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో 14 ఎంపి సీట్లు గెలవడమే తమ లక్ష్యంగా ముందుకు పోతామన్నారు. లిక్కర్ స్కామ్ తెరపైకి వచ్చినప్పుడు ఎంపి బండి సంజయ్.. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అవుతుందని చెప్పారని ఏమైందని ప్రశ్నించారు.

ఒబిసి గుర్తింపునకు ఎదురుచూపులు

- 40 కులాలు కేంద్ర విద్య, ఉపాధి అవకాశాలకు దూరం
- రెండుసార్లు జాతీయ బిసి కమిషన్ విచారణ
- కేంద్ర సోషల్ జస్టిస్ శాఖలో పెండింగ్‌లో ఫైలు
- ఎన్నికల్లోపు పూర్తయ్యేనా?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత స్వాతంత్ర్యపు 75 వసంతాల వజ్రోత్సవాలు పూర్తయిన తరుణంలోనూ దేశంలో 80 కులాలు, రాష్ట్రంలో 40 కులాలకు కేంద్ర ప్రభుత్వ ఒబిసి గుర్తింపు దక్కలేదు. ఆ సామాజిక తరగతుల వారు విద్య, ఉపాధి అవకాశాలకు ఆమడ దూరంలో జీవిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (24), 16 (4) వర్తించకపోవడంతో న్యాయబంద్ధంగా రావాల్సిన కేంద్ర ప్రభుత్వ విద్య, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వ చివరి పార్లమెంట్ సమావేశాలు కావడం ఈ సెషన్‌లోనైనా ఒబిసి బిల్లును కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలుపుతుందా అని 40 కులాలు ఎదురు చూస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టే 6వ, 9వ తరగతి జవహర్ నవోదయ, కేంద్ర సైనిక్ ప్రవేశ పరీక్షలు శనివారంతో పూర్తయ్యాయి. 40 కులాల్లోని విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు హాజరైనప్పటికీ ఒబిసి కుల గుర్తింపు లేక వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉందని ఆ సామాజిక తరగతుల ప్రతినిధులు వాపోతున్నారు.

ఢిల్లీకి రెండుసార్లు విచారణకు హాజరు

జాతీయ ఒబిసి కమిషన్ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్రంలోని 40 కులాల ప్రతినిధులు హాజరవ్వగా.. రాష్ట్రం నుంచి బిసి కమిషన్ సభ్యులుగా నియమించబడిన తల్లోజీ ఆచారి అధికార హోదాలో విచారణ చేపట్టినప్పటికీ సరైన సమయంలో రిపోర్ట్ అందకపోవడంతో నిలిచిపోయింది. తరువాత హంసరాజ్ అహీర్ గంగారం జాతీయ బిసి కమిషన్ చైర్మెన్‌గా రెండోసారి విచారణ చేపట్టి పూర్తిస్థాయిలో సోషల్ జస్టిస్ మంత్రిత్వ శాఖకు అందించారు.

తెలంగాణ ప్రభుత్వం నుంచి 40 కులాలు ఒబిసి కోసం దరఖాస్తు చేసుకోగా, పాత కులాలైన బుక్క అయ్యవారు, గోత్రాల, బొందిలి, ఆరె మరాఠి, ఆరే, వీర శైవ లింగాయత్‌తో పాటు మరో 5, కొత్తగా బిసి ఎ జాబితాలో చేర్చిన 13 కులాలు, బిసి-డీలో చేర్చిన నాలుగు కులాలను ఒబిసి జాబితాలో చేర్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. మిగతా 12 కులాలను కోర్టులో కేసులో ఉన్నందున తీర్పు అనంతరం చేర్చే అవకాశాలున్నాయి.

ఎన్నికల్లో పూర్తయ్యేనా?

దశాబ్ద కాలంగా ఒబిసి జాబితాలో చేర్చేందుకు ఎదురుచూస్తున్న కులాలకు జాతీయ బిసి కమిషన్ పూర్తి విచారణ చేపట్టి కేంద్ర సోషల్ జస్టిస్ మంత్రిత్వ శాఖకు సిఫారసు చేసింది. కేంద్ర క్యాబినెట్ ఆమోదంతో గెజిట్ ప్రకటన కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం స్పందించి 28 కులాలను ఒబిసి జాబితాలో చేర్చి వారి భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఆకాంక్షిస్తున్నారు.

సీడ్ పథకం ద్వారా లబ్ది చేకూర్చాలి
జాదవ్ శరత్- ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కేంద్ర ప్రభుత్వం బిసి ఎ జాబితాలోని సంచార కులాలను ఒబిసి జాబితాలో చేర్చి కేంద్రం ప్రవేశపెట్టిన సీడ్ పథకం ద్వారా ఈ కులాలకు లబ్ది చేకూర్చే విధంగా కృషి చేయాలి. దశాబ్ద కాలాలుగా వెనుకబాటుకు గురైన ఈ సామాజిక తరగతులకు క్రిమీలేయర్ విధానంలో కనీస ఆదాయ పరిమితిని పెంచాలి. కేంద్ర ప్రభుత్వ విద్య ఉద్యోగాలలో సైతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి.

విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నాం
గుజ్జెటి వెంకటేష్- శ్రీ వైష్ణవ/శ్రీక్షత్రియ రామజోగి అధ్యక్షులు, సిద్దిపేట జిల్లా

తెలంగాణ రాష్ట్రంలో ఒబిసి సర్టిఫికేట్ లేకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం నవోదయ, సైనిక కేంద్రీయ విద్యాలయాల్లో నిర్వహిస్తున్న ఐఐటి, ఐఐఎం వంటి విద్యాసంస్థల్లో మా పిల్లలు అడ్మిషన్‌లు, ఉద్యోగాలు పొందలేక పోతున్నారు. అదేవిధంగా యూపీఎస్‌సీ లేదా ఎస్ఎస్‌సి వంటి వాటిలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాలు కోల్పోతున్నాం. అందువల్ల తెలంగాణలో అర్హత కలిగిన కులాలను ఒబిసిలుగా గుర్తించాలని కోరుతున్నాం.

రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నాం
తిప్పిరిశెట్టి శ్రీనివాస్- గోత్రాల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

రాష్ట్ర ప్రభుత్వం 2009లో బిసి జాబితాలో చేర్చిన గోత్రాల సామాజిక తరగతికి 2015లో ఒబిసి జాతీయ అధ్యక్షులు ఈశ్వరయ్య అధ్యక్షతన హైదరాబాదులో విచారణ చేపట్టారు. ఇప్పటివరకు మూడుసార్లు విచారణ పేరుతో కాలయాపన చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి క్యాబినెట్ ఆమోదంతో ఒబిసి గుర్తింపు ఇవ్వాలి.

తాగునీరు అందించాలి

- సిఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల చేసి నల్లగొండ జిల్లాలోని పరివాహక ప్రాంత గ్రామాలకు తాగు నీరు అందించాలని సిఎం రేవంత్‌రెడ్డిని మాజీ శాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం లేఖ రాశారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి ప్రారంభమైందని పేర్కొన్నారు. చెరువులు పూర్తిగా ఎండిపోయి, భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. మంచి బోర్లు ఎండిపోయి తాగు నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీరు కూడా గ్రామాలకు రావడం లేదని తెలిపారు. ఇటీవల సాగర్ నుంచి ఖమ్మం జిల్లా, పాలేరు ప్రాజెక్టుకు ముందు జాగ్రత్తగా నీరు విడుదల చేశారనీ, నల్లగొండ జిల్లా, సాగర్ ఆయకట్టు పరిధిలోని గ్రామాల్లోని చెరువులకైనా నీరు విడుదల చేసి నింపినట్లయితే ఆ ప్రాంతాల్లో భూగర్భ జలాల లభ్యత పెరుగుతుందని తెలిపారు. దీంతో చేతి పంపు బోర్ల ద్వారా తాగు నీటి సౌకర్యం ఏర్పడే అవకాశం ఉంటుందని సూచించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా జిల్లాకు రూ. కోటి విడుదల చేసినా, బోర్లు ఎండిపోయినందున అట్టి నిధులను పూర్తిగా వినియోగించుకునే అవకాశం ఉండదని పేర్కొన్నారు. నిండు వేసవిలో పరిస్థితి మరింత తీవ్రత ఏర్పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, నల్లగొండ జిల్లా, నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుండి పరివాహక ప్రాంతంలోని చెరువులను నింపాలనీ, తద్వారా భూగర్భ జలాల నీటి లభ్యతతో చేతి పంపు బోర్ల ద్వారా ప్రజలకు తాగు నీటి సౌకర్యం కల్పించాలని లేఖ ద్వారా సీఎంకు విజ్ఞప్తి చేశారు.

నేడు వాహనాల ర్యాలీ

- డబ్ల్యుటిఒ నుంచి భారత్ బయటకు రావాలి
- ఎస్‌కెఎం పోస్టర్ ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుటిఒ) నుంచి భారతదేశం బయటికి రావాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ట్రాక్టర్లు, వాహనాల ర్యాలీ నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ర్యాలీ పోస్టర్‌ను ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, వి ప్రభాకర్, పల్లపు ఉపేందర్‌రెడ్డి, ఆర్ వెంకట్ రాములు, గౌని ఐలయ్య, డేవిడ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు అబుదాబీలో డబ్ల్యుటిఒ సదస్సు ప్రారంభం కానున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా క్విట్ ఇండియా డేగా పాటిస్తున్నట్టు తెలిపారు. రైతులకు మినిమం సపోర్ట్ ప్రైస్ (ఎంఎస్‌పి) మంజూరు చేయకుండా భారత ప్రభుత్వాన్ని బలవంతం చేయడంతో పాటు సబ్సిడీల ప్రయోజనాలను నేరుగా బదిలీ చేయాలని వాదించడం ద్వారా పిడిఎస్‌ను ఉపసంహరించుకోవాలని డబ్ల్యుటిఒ ఒత్తిడి చేస్తున్నదని ఆరోపించారు. ఈ రెండు ప్రతిపాదనల వల్ల రైతులు, పేద ప్రజలు, ఆహార భద్రతతో పాటు దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేసి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. నిరసనలో మృతి చెందిన వారికి రూ. కోటి నష్ట పరిహారంతో పాటు, ధ్వంసమైన వంద ట్రాక్టర్ల మరమ్మతు ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాకుంటే మార్చి 14న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎం నాయకులు గోవర్ధన్, ఐఎఫ్‌టియు నాయకులు ఎం శ్రీనివాస్, హన్మేష్, అరుణ, అనురాధ, సీతారామయ్య, శంకర్ డివైఎఫ్ఐ నాయకులు కోట రమేష్, పివైఎల్ నాయకులు ప్రదీప్. పిడిఎస్‌యు నాయకులు గడ్డం శ్యాం తదితరులు పాల్గొన్నారు.

విచారణకు ఇప్పట్లో హాజరు కాలేను

- సుప్రీంకోర్టులో కేసుండగా ఎలా పిలుస్తారు
- సిబిఐకి ఎమ్మెల్సీ కవిత లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముందే నిర్ణయించిన కార్యక్రమాలున్నందున సిబిఐ విచారణకు ఇప్పట్లో హాజరు కాలేనని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ రాశారు. లిక్కర్ కేసులో విచారణకు ఈ నెల 26న డిల్లీలోని సిబిఐ కార్యాలయానికి రావాలని ఇచ్చిన నోటీసులకు స్పందిస్తూ ఆదివారం రాసిన లేఖలో కీలక అంశాలను ప్రస్తావించారు. సిఆర్‌పిసి సెక్షన్ 41ఏ కింద జారీ చేసిన నోటీసులను రద్దు చేయడం లేదా ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు.. కేసులో ఏవైనా ప్రశ్నలకు సమాధానం కావాలనుకుంటే వర్చువల్ పద్ధతిలో హాజరవ్వడానికి అందుబాటులో ఉంటానని తెలిపారు. 41ఎ కింద నోటీసులు ఇవ్వడం సబబు కాదనీ, 2022 డిసెంబరులో అప్పటి విచారణాధికారి ఇదే తరహా నోటీసును సెక్షన్ 160 కింద ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో జారీ చేసిన నోటీసుకు ప్రస్తుత నోటీసు పూర్తి విరుద్ధంగా ఉందని అభ్యంతరం చెప్పారు. 41ఏ కింద ఏ పరిస్థితుల్లో నోటీసులు ఇచ్చారో స్పష్టత లేదనీ, నోటీసు జారీ చేసిన సందర్భం కూడా ఆలోచింపజేస్తున్నదని లేఖలో వ్యాఖ్యానించారు. తనను విచారణకు పిలవబోమని అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చారని ప్రస్తావించారు. సుప్రీం కోర్టులో ప్రభుత్వం ఇచ్చిన హామీ సిబిఐకీ వర్తిస్తుందని వ్యాఖ్యానించారు. గతంలోనూ సిబిఐ బందం హైదరాబాద్‌లోని నా నివాసానికి వచ్చినప్పుడు విచారణకు సహకరించానని, నియమ నిబంధనలకు కట్టుబడి ఉండే దేశ పౌరురాలిగా సిబిఐ దర్యాప్తునకు ఎప్పుడైనా తప్పకుండా సహకరిస్తానని కవిత పేర్కొన్నారు.

రాజ్యాంగ హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- 'భారత్ బచావో' అఖిల భారత విద్యార్థుల సదస్సు

ప్రజాశక్తి - హదరాబాద్ బ్యూరో

రాజ్యాంగం మనకిచ్చిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని, వాక్ స్వాతంత్ర్యం, నిరసన తెలిపే హక్కులను ప్రభుత్వం హరిస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'భారత్ బచావో' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించే అఖిల భారత విద్యార్థుల సదస్సు ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, నిరసన తెలిపే హక్కులు కోల్పోయే ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న వారిపై పోలీసులు లాఠీలు ఝుళిపించారని, వారిని అరెస్టు చేసి జైళ్లలో నిర్బంధించారన్నారు. ఇది రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాయడమే అన్నారు. సామ్రాజ్య వాదం, ఫాసిజం ఎదుర్కొనేందుకు అందరూ సమిష్టిగా పోరాటం నిర్వహించాలని నొక్కి చెప్పారు. ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మధు ప్రసాద్ మాట్లాడుతూ. దేశానికి పతకాలు సాధించిన రెజ్లర్లు వారిపై లైంగిక దాడులు జరుగుతున్నాయని నిరసన తెలిపితే పాలకులు నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అతని పక్షం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాలే కాక యూనివర్సిటీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకున్నా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని జైలుకు పంపుతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ అనిత రాంపాల్ మాట్లాడుతూ.. భారత విద్యా వ్యవస్థ ప్రమాదంలో ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం అమలుచేయాలని చూస్తున్న నూతన విద్యా విధానం 2020 ద్వారా విద్యలో మత, మూఢ విశ్వాసాలను చొప్పించే ప్రమాదముందన్నారు. విద్యలో మత విశ్వాసాల చొరబాటు ప్రజాస్వామిక, లౌకిక సమాజ మనుగడకు విఘాతమని తెలిపారు. దేశంలో విద్యా పరిరక్షణ కోసం బలమైన ఉద్యమాలు జరగాలని, ఆ పోరాటాలకు ఢిల్లీలో రైతులు చేపట్టిన ఉద్యమమే స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. అన్నదాతల పోరాటం స్ఫూర్తితో నేటి విద్యార్థులకు తక్షణమే ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేతలు కె గోవర్ధన్, జీ ఝాన్సీ, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, జస్టిస్ కొల్సే పాటిల్, భారత్ బచావో నేతలు గాదె ఇన్నయ్య, డాక్టర్ ఎమ్. ఎఫ్. గోపీనాథ్, జంజర్ల రమేశ్ బాబు, వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థి నేతలు తదితరులు పాల్గొన్నారు.